సాక్షి మంచిర్యాల

శనివారం । 1 । జూలై । 2023

I



కోట్నాక భీంరావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కేసీఆర్



భీం విగ్రహావిష్కరణలో కేసీఆర్, మంత్రి ఐకే రెడ్డి, ఎమ్మెల్సీ విఠల్, సీఎస్ శాంతికుమారి, విప్ సుమన్

జై భీం.. రాం రాం

- పోరాట యోధుడిని స్మరించి.. ఆదివాసీలకు అభివాదం చేసి..
- ఉత్సాహంగా సాగిన సీఎం కేసీఆర్ కుమురంభీం జిల్లా పర్యటన
- అట్టహాసంగా కలెక్టరేట్, ఎస్పీ, బీఆర్ఎస్ కార్యాలయాల ప్రారంభోత్సవం
- ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో పోడు పట్టాల పంపిణీకి శ్రీకారం



బహిరంగ సభకు హాజరైన ప్రజలు, అభివాదం చేస్తున్న కేసీఆర్

ఆసిఫాబాద్: ఆదివాసీ పోరాటయోధుడు కుమురం భీ పుట్టిన గడ్డపై ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన శుక్రవారం ఉత్సాహంగా సాగింది. కుమురంభీం జిల్లాలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన కోసం హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో మధ్యాహ్నం జిల్లా కేంద్రం ఆసిఫాబాద్‌కు చేరుకున్నారు. ముఖ్యమంత్రికి రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ హేమంత్ బోర్కడే పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. కుమురంభీం చౌక్‌కు చేరుకుని ఆదివాసీ వీరుడు కుమురంభీం విగ్రహాన్ని ఆవిష్కరించారు. పూలమాల వేసి నివాళులర్పించారు. తర్వాత బీఆర్ఎస్ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించారు. పార్టీ జెండా ఎగురవేసి తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కోనేరు కోనప్పను కుర్చీలో కూర్చోబెట్టి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చిల్డ్రన్స్ పార్కులో ఏర్పాటు చేసిన మాజీ మంత్రి కోట్నాక భీంరావు విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. ఆదివాసీలు గుస్సాడీ నృత్యాలతో ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు.

సమీకృత భవనం ప్రారంభం..

జిల్లా కేంద్రంలో రూ.52.50 కోట్లతో నిర్మించిన నూతన సమీకృత కలెక్టరేట్ భవన సముదాయాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ అంజనీకుమార్, మంత్రి ఐకే.రెడ్డి, హోంశాఖ మంత్రి మహమూద్ అలీ, ఆర్అండ్‌బీ శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఆర్అండ్‌బీ కమిషనర్ గణపతిరెడ్డి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎస్పీ సురేశ్‌కుమార్, తెలంగాణ పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, కోనేరు కోనప్ప, ఎమ్మెల్సీ దండె విఠల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ హేమంత్ బోర్కడేను కుర్చీలో కూర్చోబెట్టారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. తర్వాత రూ.25.90 కోట్లతో నిర్మించిన జిల్లా పోలీసు కార్యాలయాన్ని ప్రారంభించారు. ఎస్పీ సురేశ్‌కుమార్‌ను కుర్చీలో కూర్చోబెట్టి అభినందించారు. సీఎంతోపాటు మంత్రులు, ఉన్నతాధికారులను కలెక్టర్, ఎస్పీ శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఆసిఫాబాద్‌ను కుమురంభీం జిల్లాగా ఏర్పాటు చేసి ఎంతో అభివృద్ధి సాధించామన్నారు. ప్రభుత్వ సేవలన్నీ సమీకృత కలెక్టరేట్ భవనంలో ఒకేచోట అందిస్తున్నామని పేర్కొన్నారు. సమీకృత కలెక్టరేట్ భవనాన్ని రాష్ట్రంలో 22వ సమీకృత కలెక్టరేట్ భవనంగా ప్రారంభించుకున్నామని తెలిపారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ స్వచ్ఛమైన నల్లా నీరందించడంతో ప్రజల ఆరోగ్యాలు మెరుగుపడ్డాయన్నారు.

పోడు పట్టాల పంపిణీ

దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న పోడు భూముల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా కేంద్రంలో సీఎం కేసీఆర్ లాంఛనంగా ప్రారంభించారు. ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాలకు చెందిన 12మంది లబ్ధిదారులకు పట్టా పాసుపుస్తకాలు అందజేశారు. సీఎం ఆదివాసీలను ఉద్దేశించి మాట్లాడుతూ గిరిజన సంప్రదాయం రీతిలో రాం రాం అంటూ అభివాదం చేశారు. మహిళల పేరుతో పట్టా పాసుపుస్తకాలు జారీ చేస్తున్నామని తెలిపారు. పోడు రైతులకు సైతం ఈ వానాకాలం నుంచే రైతుబంధు పథకం వర్తింపజేస్తామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 1.51 లక్షల మందికి 4.6 లక్షల ఎకరాల పోడు పట్టాలు ఇచ్చినట్లు వివరించారు. గిరిజనేతరులు 75 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నట్లు రుజువు చేస్తే వారిని కూడా అర్హులుగా గుర్తించి పట్టాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పోడు పట్టాలు పంపిణీ చేసిన క్రమంలో గతంలో పోడు భూములు ఆక్రమించిన గిరిజనులపై నమోదైన కేసులు ఎత్తివేస్తామని ప్రకటించారు. ఆసిఫాబాద్ నుంచి పోడు పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఇతర రైతుల తోపాటు వీరికి రైతుబంధు విడుదల చేయాలని ఆదేశాలు ఇస్తున్నామని పేర్కొన్నారు. అద్భుత కట్టడాలు కట్టిన ఘనత మంత్రి వేముల ప్రశాంత్, ఆర్అండ్‌బీ అధికారులదేనని కొనియాడారు. రూ.300 కోట్లతో మారుమూల ప్రాంతాల్లో త్రీఫేజ్ విద్యుత్ సరఫరా జరుగుతోందని, గిరివికాస్ పథకం కింద అర్హులైన రైతుల పొలాల్లో విద్యుత్ మోటార్లు బిగించినట్లు వివరించారు. జిల్లా కేంద్రంలో ఎస్పీ కార్యాలయం ఏర్పాటుతో రక్షణ వ్యవస్థ మరింత పటిష్టమైందన్నారు. దీంతో పాటు వైద్యకళాశాల మంజూరు చేసి భవన నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా సకల జనుల సమ్మెలో ఉద్యోగులు కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పుడే తెలంగాణ నాన్‌గెజిటెడ్ అధికారుల సంఘాన్ని అదే పేరుతో కొనసాగించడం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై వారికున్న నిబద్ధతను తెలియజేస్తుందన్నారు. విద్యుత్ కోతలు లేని తెలంగాణలో వ్యవసాయ రంగంతోపాటు పరిశ్రమలకు 24 గంటలు నిరంతర విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. కాగా, గాయకుడు సాయిచంద్ చిత్రపటానికి వేదికపై కేసీఆర్ నివాళి అర్పించారు.



కలెక్టరేట్ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న కేసీఆర్, మంత్రులు మహమూద్ అలీ, ప్రశాంత్‌రెడ్డి, ఐకేరెడ్డి



బహిరంగ సభ వేదికపై విప్ బాల్క సుమన్, మాజీ ఎమ్మెల్సీలు పురాణం సతీష్, నారదాసు లక్ష్మణ్‌రావు, ఎమ్మెల్యేలు సక్కు, కోనప్ప, రామన్న



కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి ఐకేరెడ్డి

అభివృద్ధికి హామీ

- కుమురంభీం జిల్లాకు సీఎం వరాలు
- రూ.75 కోట్లతో వార్ధా వంతెన
- మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు

ఆసిఫాబాద్: నూతనంగా ఏర్పడిన కుమురంభీం జిల్లా అభివృద్ధికి సీఎం కేసీఆర్ భరోసానిచ్చారు. జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్ పక్కన ఏర్పాటు చేసిన ప్రగతి నివేదన సభ సక్సెస్ అయింది. నేతలు అంచనా వేసిన దానికంటే అధిక సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో సీఎం ఆశ్చర్యపోయారు. సభ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. సీఎం రాకకోసం సుమారు మూడు గంటలపాటు నిరీక్షించాల్సి వచ్చింది. మంచినీటి కోసం ప్రజలు ఇబ్బంది పడాల్సి వచ్చింది. సాయంత్రం.4.14 గంటలకు ప్రత్యేక వాహనంలో సభాస్థలికి చేరుకున్న సీఎం ప్రజలకు అభివాదం చేశారు. సుమారు 20 నిముషాలపాటు సాగిన ప్రసంగం ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి పోర్టల్ రద్దు చేస్తామని ప్రకటించడంపై.. ధరణి తీసేస్తే మళ్లీ పైరవీకారుల, దోపిడీదారుల రాజ్యం వస్తుంది. ధరణి ఉండాలా.. వద్దా? మీరే చెప్పండి... చేతులు లేపండనడంతో పలువురు చేతులు లేపారు. పోడు పట్టాలతో సీఎంకు జేజేలు పలికారు. అనంతరం రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా కుమురంభీం జిల్లా ఏర్పాటుతో అభివృద్ధి వేగవంతమైందన్నారు. ఆదివాసీలకు పట్టాలివ్వడం సంతోషకరమైన దినమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కోనప్ప మాట్లాడుతూ నాగమ్మ చెరువు అభివృద్ధికి రూ.5 కోట్లు ఇవ్వాలని కోరారు. గిరజనేతరులకు కూడా రైతుబంధు వర్తింపజేయాలన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ హయాంలో అన్నిరంగాల్లో జిల్లా అభివృద్ధి చెందుతుందన్నారు. ఎమ్మెల్యే సక్కు మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో పోడు పట్టాలు పంపిణీ అభినందనీయమన్నారు. కుమురంభీం, వట్టివాగు ప్రాజెక్టుల కాల్వల స్థిరీకరణకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

నిధులు మంజూరు..

ఎమ్మెల్యే కోనప్ప విన్నపం మేరకు నిధులు అడిగిన వెంటనే సిర్పూర్ నియోజకవర్గంలోని గుండాయిపేట్- నందివర్ధ వద్ద వార్ధా నదిపై వంతెన నిర్మాణానికి రూ.75 కోట్లు మంజూరు చేశారు. అలాగే కౌత్మీర్- దహెగాం వరకు డబుల్ రోడ్ నిర్మాణానికి రూ.32 కోట్లు మంజూరు చేశారు. కాగజ్‌నగర్‌లో ఐటీఐలో మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆసిఫాబాద్, మంచిర్యాలలోని 9 మున్సిపాటిలీలకు ఒక్కో మున్సిపాలిటీకి రూ.25 కోట్లు, గ్రామ పంచాయతీలకు రూ.10 లక్షల చొప్పున మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

సంతోషంగా ఉంది..

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ రాష్ట వ్యాప్తంగా 30 జిల్లాలో రూ.1,649 కోట్లతో సమీకృత కలెక్టరేట్ భవనాలు నిర్మించగా, ఇప్పటి వరకు 21 పూర్తి చేసినట్లు వెల్లడించారు. 22వ జిల్లాగా కుమురంభీం ఆసిఫాబాద్‌లో సమీకృత కలెక్టరేట్ భవనం ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ క్రమంలో ప్రజలకు పరిపాలన అతి చేరువలో ఉంటుందన్నారు. గతంలో ఉమ్మడి జిల్లా ప్రజలకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ఇబ్బందులు పడేవారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి దార్శనికతతో జిల్లాల విభజన చేసి ప్రతి జిల్లాను అత్యంత వేగంగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. తండాలు, గూడేలను గ్రామ పంచాయతీలుగా మార్చి గిరిజనుల సాధికారతకు కృషి చేస్తున్నామని తెలిపారు. గిరిపుత్రులకు ఎంతోకాలంగా సాగు చేసుకుంటున్న పోడు భూములకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పట్టాలు పంపిణీ చేస్తున్నామని, పట్టాలు పొందిన వారికి రైతుబంధు సైతం వర్తిస్తుందని వివరించారు. దేశంలో అత్యధిక పోడు పట్టాలు పంపిణీ చేసిన రాష్ట్రంగా తెలంగాణ 3వ స్థానంలో నిలిచిందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో ఐడీసీ చైర్మన్ వేణుగోపాలాచారి, నిర్మల్ జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో వరుణ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, కుమురంభీం మనవడు కుమురం సోనేరావు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్, బోథ్ ఎమ్మెల్యే బాపురావు, మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్ రావు, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

జిల్లాకు సీఎం వరాలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కుమురంభీం జిల్లా కేంద్రం ఆసిఫాబాద్‌లో శుక్రవారం జరిగిన బహిరంగ సభలో మంచిర్యాల జిల్లాలోని ఏడు మున్సిపాలిటీలకు రూ.25 కోట్ల చొప్పున, 311గ్రామ పంచాయతీలకు రూ.10లక్షల చొప్పున నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఈ నెల 9న మంచిర్యాల పర్యటనలో ఎటువంటి నిధుల ప్రకటన చేయలేదు. ఈ నేపథ్యంలో ఇక్కడి ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, సుమన్, చిన్నయ్య విజ్ఞప్తుల మేరకు ముఖ్యమంత్రి ప్రత్యేక నిధుల నుంచి ఇస్తున్నట్లు ప్రకటిస్తున్నట్లు సీఎం కేసీఆర్ తెలిపారు. జిల్లాలో ఏడు మున్సిపాలిటీలకు రూ.175కోట్లు, గ్రామ పంచాయతీలకు రూ.30.11కోట్లతో పలు రకాల అభివృద్ధికి నిధులు ఉపయోగపడనున్నాయి.

ఎస్సై కుటుంబానికి హోంమంత్రి పరామర్శ



జహిరొద్దీన్ కుటుంబ సభ్యులతో హోంమంత్రి

మంచిర్యాలక్రైం: మంచిర్యాల ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో ఎస్సైగా పని చేసిన సయ్యద్ జహీరొద్దీన్ కుటుంబానికి హోంమంత్రి మహమూద్ అలీ శుక్రవారం పరామర్శించారు. సయ్యద్ జహీరొద్దీన్ కరోనాతో 2021 మే 9న చనిపోయారు. ఆసిఫాబాద్ పర్యటనకు వెళ్తున్న హోం మంత్రి మంచిర్యాలలోని జాఫర్‌నగర్‌లో నివాసం ఉంటున్న జహీరొద్దీన్ భార్య సహేదా తబస్సుమ్, కుటుంబ సభ్యులను పరామర్శించారు. హోంమంత్రికి రామగుండం సీపీ రెమారాజేశ్వరి స్వాగతం పలికారు. డీసీపీ సుధీర్‌రాంనాథ్ కేకన్, ఏసీపీ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

మొక్క నాటిన సీఎస్ శాంతికుమారి



మొక్క నాటి నీళ్లు పోస్తున్న సీఎస్ శాంతికుమారి

నస్పూర్/శ్రీరాంపూర్: నస్పూర్ పట్టణంలోని సీసీసీ సింగరేణి అతిథి గృహం వద్ద ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మొక్క నాటా రు. ఆసిఫాబాద్‌లో శుక్రవారం సీఎం కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్తూ మార్గమధ్యంలో ఇక్కడ ఉదయం ఆగారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా అధికారులు ఘనంగా స్వాగతం పలికి మర్యాదపూర్వకంగా కలిశా రు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ రాహుల్, ట్రైనీ కలెక్టర్ గౌతమి, రామగుండం పోలీస్ కమిషనర్ రెమారాజేశ్వరి, డీసీపీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్, శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జడ్జిగా సత్తయ్య సేవలు మరువలేనివి



సత్తయ్యను సన్మానిస్తున్న న్యాయవాదులు

మంచిర్యాలక్రైం: జిల్లా న్యాయమూర్తిగా విధులు నిర్వర్తించిన బత్తుల సత్తయ్య సేవలు మరువలేనివని న్యాయమూర్తులు, న్యాయవాదులు కొనియాడారు. శుక్రవారం స్థానిక పటేల్ గార్డెన్‌లో న్యాయమూర్తుల ఆధ్వర్యంలో, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక స్వాగత్ హోటల్‌లో న్యాయమూర్తి సత్తయ్య ఉద్యోగ విరమణ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు, న్యాయవాదులు మాట్లాడుతూ సత్తయ్య నిష్పక్షపాతంగా న్యాయమైన నిర్ణయాలు తీసుకుంటూ న్యాయవ్యవస్థకు మంచిపేరు తెచ్చారని కొనియాడారు. జిల్లాలో పలు కోర్టుల అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. అనంతరం శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు ఉదయ్‌కుమార్, అర్పితరెడ్డి, అజయ్‌కుమార్, ఉపనిషద్వని, పీపీ రాజమల్లు, సహేన సుల్తానా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్త సత్తయ్య, న్యాయవాదులు పాల్గొన్నారు.

శిశువు మృతదేహంతో ఆందోళన



రోడ్డుపై ఆందోళన చేస్తున్న తల్లి, బంధువులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి బజారు ఏరియాలోని ఓ ప్రైవేట్ చిన్నపిల్లల ఆస్పత్రి ఎదుట శిశువు మృతదేహంతో తల్లిదండ్రులు, బంధువులు ఆందోళనకు దిగారు. వైద్యం కోసం మూడు నెలల శిశువును ఆస్పత్రికి తీసుకు రాగా సరిగా వైద్యం చేయకపోవడంతో మృతిచెందాడని ఆరోపించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. తాండూర్ మండల కేంద్రం ఐబీ చౌరస్తా కొత్త గుడిసెల ప్రాంతానికి చెందిన జాడి కిషన్, కళావతి దంపతుల బాబుకు జ్వరం రావడంతో ఐదు రోజుల క్రితం ఆస్పత్రికి తీసుకొచ్చారు. మందులు రాసిచ్చి ఐదు రోజుల తర్వాత రావాలని చెప్పడంతో శుక్రవారం వచ్చారు. నంజు తీసేయాలని చెప్పి పైపు నోట్లో పెట్టడంతో శ్వాస తీసుకోవడానికి బాబు ఇబ్బంది పడ్డాడని తెలిపారు. డాక్టర్ ప్రైవేటు అంబులెన్స్‌ను రప్పించి మంచిర్యాలలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుడి సూచన మేరకు కరీంనగర్‌కు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. బాబు మృతదేహంతో తల్లిదండ్రులు బెల్లంపల్లిలోని పిల్లల ఆస్పత్రి ఎదుట రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. దీంతో వైద్యుడు, సిబ్బంది ఆస్పత్రికి తాళం వేసి పారిపోయారు. శుక్రవారం రాత్రి చీకట్లోనే తల్లిదండ్రులు, బంధువులు ఆందోళన కొనసాగించారు. కాగా, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ శంకరయ్య సిబ్బందితో వచ్చి బందోబస్తు పర్యవేక్షించారు.

నేడే గ్రూపు-4 పరీక్ష

- గంట ముందే పరీక్ష కేంద్రాల్లోకి..
- 15నిమిషాల ముందే గేటు బంద్



మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో శనివారం నిర్వహించనున్న టీఎస్‌పీఎస్సీ గ్రూప్-4 పరీక్షల నిర్వహణకు సంబంధిత శాఖల అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. మొదటి పేపర్ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, రెండవ పేపర్ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షల నిర్వహణ ఉండగా.. అభ్యర్థులు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. 15 నిమిషాల ముందే కేంద్రాల గేట్లు మూసి వేయనున్నారు. జిల్లాలో 94 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, 27,801 అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. షూష్‌తో వచ్చిన వారినీ అమనుతించరు. చెప్పులుతో వచ్చిన వారికి మాత్రమే అనుమ తి ఉంటుంది. హాల్ టికెట్‌పై ఫొటో రాని అభ్యర్థులు 3 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు హాల్ టికెట్‌పై అతి కించి గెజిటెడ్ అధికారి సంతకం తీసుకోవాలి. ప్రతీ పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తారు. ప్రశ్నపత్రాలను జిల్లా కేంద్రంలోని స్ట్రాంగ్ రూమ్ నుంచి బందోబస్తు మధ్య తరలిస్తారు.

ధరణి ఆపరేటర్లకు వేతన కష్టాలు


- ఆరు నెలలుగా అందక ఇబ్బందులు
- కనీస వేతనమూ కరువే..



తహసీల్దార్ కార్యాలయంలో ధరణి ఆపరేటర్

దండేపల్లి: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ధరణి పోర్టల్(వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్) కంప్యూటర్ ఆపరేటర్లు వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. తహసీల్దార్ కార్యాలయాల్లో కాంట్రాక్టు పద్ధతిన పని చేస్తున్న ఆపరేటర్లకు ఆరు నెలలుగా వేతనాలు రావడం లేదు. జిల్లాలో 19మంది ధరణి ఆపరేటర్లు పని చేస్తున్నారు. నెల నెల వేతనాలు అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్త రెవెన్యూ చట్టంలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం 2020లో వ్యవసాయ భూముల రిజిస్టేషన్ కోసం ధరణి పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం 33 రకాల మాడ్యుల్స్ అందుబాటులో ఉన్నాయి. దీంట్లో భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్, విరాసత్, మ్యుటేషన్లు, టీఎం33 వంటి పలు రకాల మాడ్యుల్స్ ఉన్నాయి. వీటిలో ప్రతి దాని ద్వారా ప్రభుత్వానికి ఫీజు చెల్లించాల్సిందే. ధరణి పోర్టల్ ద్వారా ప్రభుత్వానికి దండిగా ఆదాయం కూడా సమకూరుతోంది. పైగా ధరణి పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చినప్పటి నుంచి రిజిస్ట్రేషన్ల ధరలు నాలుగు సార్లు పెంచింది. కానీ అందులో పనిచేస్తున్న ఆపరేట్ల వేతన విషయంలో మాత్రం ఎలాంటి శ్రద్ధ చూపడం లేదు. ప్రభుత్వ తీరుపై కంప్యూటర్ ఆపరేటర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్న తమను ప్రభుత్వం గుర్తించడం లేదని, కనీస వేతనం చెల్లించడం లేదని వాపోతున్నారు. ధరణి రూపకల్పన సమయంలో ఆపరేటర్ల నియామకాన్ని ప్రభుత్వం ఓ ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించింది. నియామక సమయంలో నెలకు రూ.24 వేలు చెల్లిస్తామని చెప్పారు. కానీ ప్రస్తుతం ఇచ్చేది నెలకు రూ.11,070 మాత్రమే. పైగా ఇవి కూడా నెల నెల రాకపోయే సరికి వారి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ప్రభుత్వం స్పందించి వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతున్నారు.


చాలా ఇబ్బంది అవుతోంది..



నెల నెల వేతనాలు చెల్లించకపోవడంతో చాలా ఇబ్బంది అవుతోంది. ఆరు నెలలుగా వేతనాలు రాకపోయే సరికి పనిచేయడం కష్టమవుతోంది. కుటుంబ ఖర్చులకు మరింత ఇబ్బంది పడాల్సి వస్తోంది. వేతనాలు వెంటనే చెల్లించాలి. కనీస వేతనాన్ని అమలు చేయాలి.

– ఉదయ్, ధరణి కంప్యూటర్ ఆపరేటర్

నెల నెల చెల్లించాలి..



జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల్లో పనిచేస్తున్న ధరణి కంప్యూటర్ ఆపరేటర్లకు నెల నెల వేతనాలు చెల్లించాలి. ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్న తమకు కనీస వేతనం అందించాలి. ఏజెన్సీ ద్వారా కాకుండా తమ వేతనాలు ప్రభుత్వమే ట్రెజరీ ద్వారా చెల్లించాలి. తమ ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించాలి.

– కుమార్, ధరణి ఆపరేటర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

క్లుప్తంగా

బ్యాంక్ ఉద్యోగి ఇంట్లో చోరీ

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా సమీపంలోగల బ్యాంక్ ఉద్యోగి వెంకటేశ్ ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. స్థానిక ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. బ్యాంక్ ఉద్యోగి వెంకటేశ్ చౌరస్తా సమీపంలోని ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. గురువారం సెలవు కావడంతో కుటుంబీకులతో కలిసి స్వగ్రామం వెంకట్రావుపేటకు వెళ్లి శుక్రవారం ఉదయం రాగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూసి చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని డాగ్‌స్క్వాడ్‌తో ఇంటి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. సుమారు 15 తులాల బంగారం, రూ.3వేల నగదు చోరీకి గురైనట్లు వెంకటేశ్ ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెరిట్ జాబితా ప్రదర్శన

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో గుర్తించబడిన పోస్టుల భర్తీకి కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేసేందుకు 6.11.2019న నిర్వహించిన రాతపరీక్ష మెరిట్ జాబితాను డీఈవో, ఎంఈవో కార్యాలయాల నోటీసు బోర్డులపై ప్రదర్శించనున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. ఎంఐఎస్ కో ఆర్డినేటర్, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, సిస్టమ్ ఎనలిస్ట్, అసిస్టెంట్ ప్రోగ్రామర్ పోస్టులు భర్తీ చేసేందుకు స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్, తెలంగాణ సమగ్రశిక్ష, హైదరాబాద్ పరీక్ష నిర్వహించినట్లు పేర్కొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

మంచిర్యాలఅర్బన్: జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు 2023 సంవత్సరానికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం భారత ప్రభుత్వం పాఠశాల విద్య, అక్షరాస్యత మంత్రిత్వశాఖ శాస్త్రీభవన్, న్యూఢిల్లీ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తోందని డీఈవో యాదయ్య తెలిపారు. htpp//:nationalawardsto teachers.education.gov.in ద్వారా దరఖాస్తులను జూలై 15లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

నకిలీదే పెత్తనం..!

- జిల్లాలో రెండు లక్షల ఎకరాల్లో పత్తిసాగు
- 20శాతం విత్తిన గుర్తింపులేని విత్తనాలు!
- పట్టుబడుతున్నా అధికారుల పట్టింపేది?
- పంటనష్టపోయి మునుగుతున్న రైతులు


కన్నెపెల్లి మండలంలో విత్తన సాల్లు పెడుతున్న రైతు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో అధికసంఖ్యలో నాసిరకం, నాణ్యతలేని ప్రభుత్వ గుర్తింపు లేని పత్తి విత్తనాలే మార్కెట్‌లో చెలామణి అవుతున్నాయి. సంబంధిత అధికారులు నకిలీ విత్తనాలను అరికట్టడంలో నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. సమాచారం ఇస్తే గాని పర్యవేక్షించిన దాఖలాలు లేవు. మంచిర్యాల, మందమర్రి కేంద్రాల నుంచే కొందరు వ్యాపారులు పలు గ్రామాలకు జోరుగా నకిలీ విత్తనాలు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. వ్యాపారులు అధికమొత్తం కమీషన్‌కు ఏజెంట్లను నియమించుకొని గ్రామాల్లో విక్రయాలు సాగిస్తున్నారు. సీజన్‌కు ముందు కొన్ని చోట్ల నకిలీ విత్తనాలు పట్టుకుని హడావుడి చేసిన అధికారులు ఆ తర్వాత మిన్నకుండి పోయారు. ప్రస్తుతం నిఘా తగ్గించి 'మామూలు'గా తీసుకుంటున్నారు. ఈ ఏడాది ప్రభుత్వ గుర్తింపు పొందిన కంపెనీ విత్తనాలతో పాటు 20 శాతం వరకు గ్లైసిల్ నిషేధిత గుర్తింపు లేని విత్తనాలు సాగు చేస్తున్నట్లు తెలుస్తోంది. వానాకాలం సాగుకు ముందే ఏప్రిల్, మేలో తాండూర్, భీమిని, కన్నెపెల్లి, మందమర్రితోపాటు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని దహెగాం, పెంచికల్‌పేట తదితర ప్రాంతాల్లో నకిలీ విత్తనాలు పట్టుకున్నారు. పూర్తిస్థాయిలో నిఘా లేకే గ్రామాల్లో నకిలీ విత్తన విక్రయాలు జోరుగా సాగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. దళారులు ఇప్పటికే నాసిరకం, రెండో రకం బీజీ-3 పేరుతో లూజు విత్తనాల పేరిట నకిలీలను అంటగట్టారనే ఆరోపణలున్నాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు 10వేల క్వింటాళ్లకుపైగా అమ్మకాలు జరిపినట్లు సమాచారం. సాగుకు అనుగుణంగా వర్షాలు కురుస్తుండడంతో గ్రామాల్లో రైతులు దళారుల వద్ద కొనుగోలు చేసిన నకిలీ విత్తనాలే విత్తుకుంటున్నారు.

రూ.కోట్లలో పెట్టుబడి

జిల్లాలో అత్యధికంగా పత్తి సాగవుతుండగా రైతులు కొంతకాలంగా బీజీ-3 విత్తనాలనే నమ్ముకుని సాగు చేస్తున్నారు. ఏటా పంట సాగుకు రూ.1,500 కోట్ల నుంచి రూ.2వేల కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. రూ.200 కోట్ల నుంచి రూ.300 కోట్లు విత్తనాల కోసం వెచ్చిస్తున్నారు. గతేడాది 1.65 వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. గత సీజన్‌లో వర్షాలు అనుకూలించడం, మద్దతు ధర కంటే అదనంగా రూ.2వేల వరకు ధర రాగా ఈసారి 2లక్షల ఎకరాల్లో సాగు కానున్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో అధికంగా బీజీ-3 విత్తన సాగు పెరిగిన నేపథ్యంలో అక్రమార్కులు దీన్ని అవకాశంగా తీసుకున్నారు. వీరు నియమించుకున్న కమీషన్ ఏజెంట్లు రైతులను మభ్యపెట్టి నాసిరకం, నాణ్యతలేని, పన్నులు చెల్లించని, ప్రభుత్వ గుర్తింపు లేని రెండో రకం విత్తనాలు వారికి విక్రయిస్తున్నారు.


పత్తి విత్తనాలు వేస్తున్న కూలీలు

కలుపును తట్టుకుంటుందని..

రెండేళ్లుగా కొందరు అక్రమార్కులు బీటీ-3 పేరుతో కలుపు నివారించేందుకు సులువుగా ఉంటుందని గుర్తింపు లేని గ్లైసిల్ విత్తనాలు అంటగడుతున్నారు. కిలో రూ.2,500 నుంచి రూ.3వేల వరకు విక్రయిస్తున్నారు. 450 గ్రాముల ప్యాకెట్‌ను రూ.1,200 నుంచి రూ.1,500 వరకు అమ్ముతున్నారు. విత్తన ముఠా పలు గ్రామాల్లో కొంతమంది బడా రైతులకు వందల కిలోల వరకు అప్పగించి కమీషన్లు ఇస్తున్నారు. వాటితోనే కలుపు ఖర్చు ఉండదని, రెండుసార్లు గడ్డి మందు పిచికారీ చేస్తే చాలు.. పంట చేతికి వచ్చేవరకూ కూలీల ఖర్చు ఉండదని ప్రచారం చేయిస్తున్నారు. ఇలా నమ్మి నాసిరకం, గుర్తింపు లేని విత్తనాలు వేసి కలుపును నివారించేందుకు మందులు పిచికారీ చేయగా పత్తి చెట్లు కూడా చనిపోయిన సందర్భాలున్నాయి. గతేడాది మొలక రాక, గడ్డిమందు పిచికారీ చేస్తే మొక్కలు చనిపోయి, కాయ సైజు చిన్నగా వచ్చి దిగుబడి తగ్గి వేల ఎకరాల్లో చాలామంది రైతులు నష్టపోయారు.

పెద్ద ఎత్తున పట్టుబడుతున్నా..

రైతులను కొన్నేళ్లుగా నకిలీ విత్తనాలు నష్టాలకు గురి చేస్తున్నాయి. అక్రమార్కులపై పీడీ యాక్ట్ అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశిస్తున్నా.. ఎన్ని కఠిన చట్టాలు తీసుకువస్తున్నా నకిలీకి బ్రేక్ పడడంలేదు. పైగా ఏటేటా పెరుగుతూ వస్తోంది. నకిలీ విత్తనాలు గుజరాత్, గుంటూరు, కర్నూల్ తదితర ప్రాంతాల నుంచి వస్తున్నాయి. దీని వెనుక ఎవరున్నారు? రైతులకు చేరవేస్తోందెవరు? ఇందులో కీలపాత్ర పోషించేదెవరు? ఇదివరకు ఏయే ప్రాంతాల నుంచి ఇవి రైతులకు చేరి ఉంటాయి? అనే సమాచారాన్ని అధికారులు గ్రహించాల్సి ఉంది. జిల్లాలో పలు పట్టణ ప్రాంతాలకు చెందిన బ్రోకర్లు, కొంతమంది ఈ రాకెట్‌లో భాగస్వాములయ్యారని తెలుస్తోంది. కొందరు ద్వితీయశ్రేణి రాజకీయ నాయకులు కూడా ఈ దందాలో పాలుపంచుకుంటున్నట్లు సమాచారం. వీరికి పలువురు అధికారులు వత్తాసు పలకడంతో వీరి వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతున్నట్లు సమాచారం. ఉన్నతాధికారులు ఈ రాకెట్‌ని ఛేదించి గుట్టుబయట పెట్టాలని రైతాంగం డిమాండ్ చేస్తోంది.

పర్యావరణాన్ని కాపాడాలి


మొక్క నాటుతున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడాలని శ్రీరాంపూర్ జీఎం బీ సంజీవరెడ్డి సూచించారు. శుక్రవారం ఆర్కే5 గని ప్రాంగణంలోని బలరాం వనంలో హరితహారం నిర్వహించి సుమారు 200 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడారు. 2 హెక్టార్లలో బలరాం వనం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇక్కడ అన్ని రకాల పండ్ల మొక్కలు పెంచడం అభినందనీయమన్నారు. నాటిన మొక్కలు సంరక్షించాలని సూచించారు. పండ్ల మొక్కలు పెంచితే పక్షులు, కోతులకు ఆహారం లభిస్తుందని తెలిపారు. కాలనీలో కోతుల బెడద కూడా తప్పుతుందని పేర్కొన్నారు. పరిసరాల పరిశుభ్రత, పచ్చదనానికి సింగరేణి అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఇందులో భాగంగానే ఏరియాలో స్వచ్ఛ పక్వాడా కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. గ్రూప్ ఏజెంట్ ఏవీ రెడ్డి, డీజీఎం (పర్సనల్) అరవిందరావు, ఏరియా ఇంజినీర్ రమేశ్‌బాబు, డీజీఎం (వర్క్‌షాప్) చంద్రశేఖర్‌రెడ్డి, డీవైసీఎంవో రమేశ్‌బాబు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ శ్రీధర్‌రావు, ఆర్కే5 గని మేనేజర్ అబ్దుల్ ఖదీర్, ఎన్విరాన్మెంట్ ఆఫీసర్ హనుమాన్‌గౌడ్, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, సీనియర్ లా ఆఫీసర్ ప్రభందిత, రక్షణాధికారి శివయ్య, సంక్షేమాధికారి రణదీప్‌గౌడ్, ఆర్కే6 ఇన్‌చార్జి మేనేజర్ శ్రీనివాస్, పిట్ సెక్రటరీలు మహేందర్‌రెడ్డి, సత్యనారాయణ, అధికారులు, యూనియన్ల ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సమావేశాలకు అన్ని సంఘాలను పిలవాలి


నిరసన తెలుపుతున్న హెచ్ఎంఎస్ నాయకులు

శ్రీరాంపూర్: గనులు, ఏరియా, కంపెనీ స్థాయిలో జరిగే సేఫ్టీ కమిటీ, మైన్స్ కమిటీ తదితర సమావేశాలన్నింటికీ అన్ని కార్మిక సంఘాలను పిలవాలని హెచ్ఎమ్మెస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియా స్టోర్స్‌లో పిట్ సేఫ్టీ కమిటీ, మైన్స్ సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తమను ఆహ్వానించలేదని హెచ్ఎమ్మెస్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య ఆధ్వర్యంలో నాయకులు స్టోర్స్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సారయ్య మాట్లాడుతూ.. జూన్ 13న జరిగిన సమావేశంలో డైరెక్టర్ (పా) బలరాం అన్ని సంఘాలను ఎన్నికలు జరిగేదాకా కంపెనీ అధికారిక సమావేశాలన్నింటికీ ఆహ్వానిస్తామని తెలిపారని గుర్తు చేశారు. కానీ.. అధికారులు కింది స్థాయిలో దీన్ని అమలు చేయడం లేదని ఆరోపించారు. ఏరియా స్టోర్స్‌లో జరిగిన మైన్స్ కమిటీ, సేఫ్టీ కమిటీ సమావేశానికి టీబీజీకేఎస్‌ను మాత్రమే ఆహ్వానించారని, మిగతా సంఘాలను పిలవలేదన్నారు. దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికలు జరిగేదాకా అన్ని సంఘాలను కంపెనీ అధికారిక సమావేశాలకు పిలవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్ సెక్రటరీ అనిల్‌రెడ్డి, నాయకులు గోళ్ల సత్తన్న, పల్లె క్రాంతికుమార్, అశోక్, నామాల శ్రీనివాస్, రేగుంట సందీప్, వెంకటేశ్, పెద్దన్న, వినయ్‌కుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అరెస్ట్‌లపై ఖండన

ముఖ్యమంత్రి కేసీఆర్ ఆసిఫాబాద్ పర్యటనను పురస్కరించుకొని గోలేటిలో తమ యూనియన్ నాయకుడు రాజబాబుతోపాటు మరి కొంతమంది నేతలను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారని యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీఎం కేసీఆర్ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయకుండా సింగరేణి ప్రాంతంలో కేసీఆర్ పర్యటిస్తూ వీటిని ప్రశ్నించే వారిని పోలీసులతో అక్రమంగా అరెస్ట్ చేయిస్తున్నారని ఆరోపించారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికైనా తమ నేతలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

భారీగా ఎస్సైల బదిలీ

మంచిర్యాలక్రైం: పోలీస్ శాఖలో కొంతకాలంగా ఎన్నికల బదిలీల ప్రక్రియ నడుస్తోంది. రెండేళ్లు మొదలుకుని ఏడాదిన్నరలోపు ఒకే చోట విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ అధికారులకు బదిలీలు తప్పడం లేదు. ఇదివరకే కమిషనరేట్ పరిధిలో సీఐల బదిలీలు జరిగాయి. ఎన్నికల నేపథ్యంలో బదిలీలు సర్వసాధారణమే అయినా ఎస్సైలు తమకు నచ్చిన చోటుకు వెళ్లేందుకు నెల రోజుల ముందు నుంచే ఎమ్మెల్యేల ఇంటి చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ ప్రయత్నాలు చేశారు. తాజాగా కాళేశ్వరం మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలోని 28మంది ఎస్సైలను బదిలీ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, బదిలీలపై కొందరు ఎస్సైలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. సీఐ, ఎస్సై స్థాయి అధికారుల బదిలీలు కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న ఓ అధికారి కనుసన్నల్లో నడుస్తున్నట్లు పలువురు అధికారులు చర్చించుకోవడం గమనార్హం. జిల్లాకు చెందిన వారిలో చెన్నూర్ టౌన్ ఎస్సై బీ సౌజన్య గోదావరిఖని టౌన్‌కు, మంచిర్యాల టాస్క్‌ఫోర్స్ ఎస్సై లచ్చన్న రామగుండం సీఎస్‌బీకి, సైబర్‌క్రైం ఎస్సై బి.మల్లేశ్ పెద్దపల్లికి, బెల్లంపల్లి ఎస్సై ఏ.రాజమణి రామగుండం సీఎస్‌బీకి, మంచిర్యాల ఎస్సై జి.సంధ్యారాణి పెద్దపల్లి సీఎస్‌బీకి, జైపూర్ ఎస్సై-2 టీ గంగరాజుగౌడ్ బసంత్‌నగర్ పీఎస్-2కు, కోటపల్లి ఎస్సై బి.వెంకటస్వామి గోదావరిఖని-1టౌన్‌కు, మంచిర్యాల ఎస్సై జి.సురేశ్ కోటపల్లికి, మంచిర్యాల సీఎస్‌బీ ఎస్సై వి.సౌమ్య మందమర్రి షీటీమ్‌కు, రామగుండం సీఎస్‌బీ ఎస్సై జి.రమేశ్ బెల్లంపల్లి వన్‌టౌన్‌కు, మంచిర్యాల ఎస్సై ఎండీ తాసినొద్దీన్ పీసీఆర్ మందమర్రికి, మంచిర్యాల టాస్క్‌ఫోర్స్ ఎస్సై ఏ.మధుసూదన్‌రావు మంథనికి, మంచిర్యాల ట్రాఫిక్ ఎస్సై ఎం.శివకేశవులు పెద్దపల్లి సీసీఎస్‌కు, మంచిర్యాల ఎస్సై ఎం.రాజేంద్రప్రసాద్ రామగుండం పీసీఆర్‌కు, తాండూర్ ఎస్సై వి.మధుసూదన్ పెద్దపల్లి సీసీఎస్‌కు, రామకృష్ణాపూర్ ఎస్సై ఎస్‌కే.ఫరీద్ గోదావరిఖని-2టౌన్‌కు, శ్రీరాంపూర్ ఎస్సై ఎన్.సుగుణాకర్ రామగుండం వీఆర్‌కు, చెన్నూర్ ఎస్సై ఎం.చంద్రశేఖర్ గోదావరిఖని-2టౌన్‌కు, గోదావరిఖని-1 ఎస్సై ఎం.శైలజ మంచిర్యాల డబ్ల్యూపీఎస్‌కు, రామగుండం ట్రాఫిక్ ఎస్సై ఏ.రాజేందర్ మంచిర్యాలకు, రామగుండం ట్రాఫిక్ ఎస్సై జి.నాగరాజు మంచిర్యాల సీఎస్‌బీకి, సీఎస్‌బీ రామగుండం ఎస్సై కే రమేశ్ మంచిర్యాల టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ అయ్యారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌కు 12 గ్రామాల ఎంపిక

మంచిర్యాలరూరల్(హాజీపూర్): స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2023కు జిల్లా నుంచి 12 గ్రామాలు ఎంపికయ్యాయి. పంచాయతీరాజ్‌శాఖ డైరెక్టర్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాహుల్ జాబితా ప్రకటించారు. అవార్డుకు ఎంపికైన గ్రామాల్లో ఈ నెల 15వ తేదీ నుంచి కేంద్ర బృందం పూర్తి స్థాయిలో పర్యవేక్షించనుంది. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, ఇంటింటా మరుగుదొడ్లు, వాటి వినియోగం, ఇంకుడుగుంతలు, ఇంటింటా తడి, పొడి చెత్త సేకరణ, కంపోస్ట్ షెడ్ నిర్వహణ తదితర 50 అంశాల వరకు కేంద్ర బృందం పర్యవేక్షిస్తుంది. ఎంపికైన 12 గ్రామాలకు నియమితులైన ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయిలో ఆయా అంశాల అమలును పర్యవేక్షించి స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2023 అవార్డుకు ఎంపికయ్యేలా కసరత్తు చేయనున్నారు. ఎంపికైన బెల్లంపల్లి మండలం లింగాపూర్‌కు డీఎల్పీవో ఫణీందర్, చెన్నూర్ మండలం కిష్టంపేటకు డీపీవో వెంకటేశ్వర్‌రావు, జన్నారం మండలం దేవునిగూడకు డీఆర్డీవో శేషాద్రి, కాసిపేట మండలం దేవాపూర్‌కు డీపీవో వెంకటేశ్వర్‌రావు, లక్సెట్టిపేట మండలం రంగపేట, తిమ్మాపూర్ గ్రామాలకు డీఆర్డీవో దత్తారావు, మందమర్రి మండలం అందుగులపేటకు డీఎల్పీవో ప్రభాకర్‌రావు, నెన్నెల మండలం చిట్టాపూర్‌కు జెడ్పీ సీఈవో కే నరేందర్, వేమనపల్లి మండలం నీల్వాయికి డీఎల్పీవో ఫణీందర్‌రావు, భీమారం మండలం ఎలకేశ్వరానికి డీఎల్పీవో ప్రభాకర్‌రావు, హాజీపూర్ మండలం టీకానపల్లికి డీఆర్డీవో శేషాద్రి, కన్నెపల్లి మండలం వీరాపూర్‌కు జెడ్పీ సీఈవో కే నరేందర్ ప్రత్యేకాధికారులుగా నియమితులయ్యారు.

పారదర్శకంగా కేటాయింపు


అలాట్‌మెంట్ ఆర్డర్ అందుకుంటున్న ఉద్యోగి

మందమర్రిరూరల్: ఏరియాలోని ఉద్యోగులకు క్వార్టర్ల అలాట్‌మెంట్ పారదర్శకంగా చేపడుతున్నట్లు ఏరియా పర్సనల్ మేనేజర్ సట్ల శ్యాంసుందర్ తెలిపారు. శుక్రవారం ఏరియాలోని సీఈఆర్ క్లబ్ ఆవరణలో నిర్వహించిన కౌన్సిలింగ్‌లో నిబంధనల ప్రకారం 50 మంది ఉద్యోగులకు క్వార్టర్ అలాట్ చేసినట్లు పేర్కొన్నారు. ఏరియాలో 80 క్వార్టర్ల నంబర్లు నోటీస్‌పై ప్రకటించగా 120 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. ఎస్వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఐఈడీ రాజన్న, ఏజెంట్ రాందాస్, సీనియర్ పీవో ఆసీఫ్, ఆఫీస్ ఓఎస్ రాజలింగు తదితరులున్నారు.

కేకే ఓసీని సందర్శించిన సింగరేణి సీఎస్వో


పరిసరాలను పరిశీలిస్తున్న శశిధర్‌రాజు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే ఓసీని సింగరేణి చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ (కార్పొరేట్) శశిధర్‌రాజు గురువారం సందర్శించారు. ఓసీ పరిసరాలు, బేస్ వర్క్‌షాపును పరిశీలించారు. గని ఆవరణలో అవసరమైన చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు సూచించారు. కాగా, మూడ్రోజుల క్రితం కేకే ఓసీలో షావల్‌కు సంబంధించిన విలువైన జాయింట్స్ చోరీకి గురైనట్లు సమాచారం. ఈ విషయాన్ని అధికారులు బయటకు రాకుండా అంతర్గతంగా విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. చోరీ ఘటనపై విచారణ కోసమే శశిధర్‌రాజు ఇక్కడకు వచ్చి ఉంటారని పలువురు చర్చించుకుంటున్నారు. ఆయన వెంట ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేశ్, ఏరియా ఎస్ఎస్వో నగునూరి రవి, సిబ్బంది ఉన్నారు.

ఎన్‌సీసీతో మంచి భవిష్యత్

లక్సెట్టిపేట: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి ఎన్‌సీసీ చేయడం వల్ల మంచి భవిష్యత్ ఉంటుందని 32వ ఎన్‌సీసీ బెటాలియన్ ఆదిలాబాద్ కల్నల్ జావిద్ వికాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని జెండావెంకటాపూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఎన్‌సీసీ పూర్తి చేసిన విద్యార్థులకు ఉద్యోగాల్లో రిజర్వేషన్ లభిస్తుందని తెలిపారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచి దేశం కోసం.. దేశ సైన్యంపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. పాఠశాల పూర్వ విద్యార్థి పెట్టెం అశోక్ సైన్యంలో విధులు నిర్వహించడం గర్వకారణమని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హవల్దార్ తేజ్‌సింగ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేకే ఓసీలో విలువైన సామగ్రి చోరీ

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే ఓసీలో మూడురోజుల క్రితం జరిగిన చోరీలో విలువైన సామగ్రి పోయినట్లు ఆలస్యంగా తెలిసింది. జూన్ 26న రాత్రి బేస్ వర్క్‌షాపులోకి ముగ్గురు దొంగలు చొరబడి అక్కడున్న షావల్ యంత్రానికి సంబంధించిన సాకెట్ పిన్నులు ఎత్తుకెళ్లారు. సు మారు రూ.70 వేల విలువైన సామగ్రి చోరీకి గురైందని ముందుగా పోలీస్‌స్టేషన్‌లో సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది పిటిషన్ ఇచ్చారు. తర్వాత మరో పిటిషన్ ఇస్తామని ముందు ఇచ్చిన పిటిషన్‌ను వాపస్ తీసుకెళ్లినట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. చోరీకి గురైన సామగ్రి విలువ రూ.రెండు లక్షల వరకు ఉంటుందని సమాచారం. చోరీకి సంబంధించిన దృశ్యాలు బేస్ వర్క్‌షాపులోని సీసీ కెమెరాలో నమోదయ్యాయి.

బైక్ ఢీకొని వృద్ధురాలి మృతి

కౌటాల: తలోడి గ్రామం వద్ద శుక్రవారం ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో నల్లూరి బుచ్చక్క (70) మృతి చెందింది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చింతలమానెపల్లి మండలం గూడెం గ్రామానికి చెందిన బుచ్చక్క గురువారం తన తమ్ముడు వెంకటేశ్ ఇంటికి వచ్చింది. శుక్రవారం ఉదయం ఆసిఫాబాద్‌లో నివాసముంటున్న తన కూతురు ఇంటికి వెళ్లేందుకు తలోడి బస్టాండ్‌కు చేరుకుంది. ఆర్టీసీ బస్సు ఎక్కేందుకు ప్రయత్నిస్తుండగా సిర్పూర్(టి) గ్రామానికి చెందిన నల్ల అవినాశ్ ద్విచక్ర వాహనంతో అతివేగంగా వచ్చి బుచ్చక్కను బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆమెకు తల, ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. బంధువులు సిర్పూర్(టి) ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందింది. సామాజిక ఆస్పత్రిలో వృద్ధురాలి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలి తమ్ముడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.